

కృష్ణానగర్‌లో వరద నీటి నుంచి వెళ్తున్న స్కూల్ బస్సు ఎక్కుతున్న విద్యార్థులు



దంచి కొడుతున్న వర్షానికి రాజీవ్ నగర్ చౌరస్తాలో రోడ్డుపై నిలిచిపోయిన వర్షం నీరు





నీట మునిగిన మైత్రీవనం వెనకాల ఉన్న గాయత్రినగర్, బుద్ధనగర్

అమీర్‌పేట టు బేగంపేట

నీట మునిగిన ప్రధాన రోడ్లు, కాలనీలు, బస్తీలు

బంజారాహిల్స్/ఎర్రగడ్డ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): అప్పటి దాకా మబ్బులు, ఎండ కలయిక.. అంతలోనే వాతావరణంలో మార్పు.. కుంభవృష్టి వర్షం జనజీవనాన్ని అంతలాకుతలం చేసింది. సోమవారం రెండుగంటల పాటు కురిసిన భారీ వర్షం నగర వాసులకు ప్రత్యక్ష నరకాన్ని చూపించింది. పలు ప్రాంతాల్లో చెట్టుకొమ్మలు విరిగిపడ్డాయి. రహదారులు చెరువులను తలపించాయి. ముఖ్యంగా అమీర్‌పేట మైత్రీవనం వద్ద భారీగా వరద నీరు నిలిచింది. ఎటు చూసినా చెరువు తలపించేలా వరద నీరు చేరడంతో రాకపోకలకు తీవ్ర ఆటంకాలు ఏర్పడ్డాయి. ఎగువ ప్రాంతం నుంచి అమీర్‌పేట మీదుగా త్రిబుల్ ఎ థియేటర్, బేగంపేట వరకు వెళ్లే నాలా పూర్తిగా నిండిపోవడంతో వరద నీరు బయటకు వచ్చి కాలనీలను, బస్తీలను ముంచెత్తాయి. మైత్రీవనం వెనకాల ఉన్న గాయత్రినగర్, బుద్ధనగర్, గురుద్వార, అమీర్‌పేట ప్రధాన రహదారి పక్కనే ఉన్న శ్రీనివాసనగర్ కాలనీలో నడుము లోతు నీరు నిలిచాయి. వాహనాలు నీట మునిగాయి. నిమ్స్ ఆస్పత్రి వెనకాల పెద్ద వృక్షం నేల కూలింది. విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. అక్కడే ఉన్న వాటర్ ట్యాంకర్‌పై చెట్టు పడడంతో వాహనం పాక్షికంగా దెబ్బతిన్నది. ఖైరతాబాద్ ప్రధాన మార్గంతో పాటు పలు ప్రాంతాల్లో మోకాలిలోతు వరకు నీరు చేరింది.

ట్రాఫిక్ జామ్..

మైత్రివనంతో పాటు అమీర్‌పేట-ఎల్లారెడ్డిగూడ వెళ్లే దారిలో ఇమేజ్ ఆస్పత్రి వద్ద భారీ వరద నీరు నిలవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర ఆటంకాలు ఏర్పడ్డాయి. సరిగ్గా కార్యాలయాలు, కళాశాలలు, పాఠశాలలు వదిలే సమయం కావడంతో ఒక్కసారిగా కురిసిన వర్షం కారణంగా ఉద్యోగులు, విద్యార్థులు గమ్య స్థానాలకు చేరేందుకు నానా కష్టాలు పడ్డారు. ప్రధాన దారితో పాటు అంతర్గత దారుల్లో కూడా వరద నీరు నిలవడంతో గంటల తరబడి ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయారు. ఎర్రగడ్డ నుంచి అమీర్‌పేట, పంజాగుట్ట, ఎర్రమంజిల్, ఖైరతాబాద్, లక్డీకాపూల్ వరకు వాహనాలు స్తంభించిపోయాయి. జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు నుంచి సాగర్ సొసైటీ పంజాగుట్ట చౌరస్తా వరకు ట్రాఫిక్ నిలిచిపోయింది. ట్రాఫిక్ పోలీసులు వాహనాలను క్రమబద్ధీకరించేందుకు అనేక అవస్థలు పడ్డారు.

రోడ్లన్నీ జలమయం

ఎర్రగడ్డ డివిజన్‌లోని రాజీవ్ నగర్ చౌరస్తా, మోతీనగర్, పాండురంగ నగర్, శంకర్‌లాల్ నగర్, ప్రేమ్ నగర్ తదితర బస్తీల్లోని చౌరస్తాల్లో రోడ్లపై నీరు మోకాలు లోతు వరకు నిలిచిపోయాయి. న్యూప్రేమ్ నగర్, ప్రేమ్ నగర్, సుల్తాన్ నగర్ బస్తీల్లో ఇళ్లలోకి వర్షం నీరు చేరడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. మూసాపేట నుంచి ఎర్రగడ్డ మీదుగా ఎస్ఆర్ నగర్ అమీర్‌పేటకు వెళ్లే రహదారితో పాటు అమీర్‌పేట నుంచి ఎర్రగడ్డ మీదుగా మూసాపేట్‌కు వెళ్లే జాతీయ రహదారులలో వాహనాలు గంటల తరబడి నిలిచిపోయాయి. వర్షం తగ్గినప్పటికీ రాత్రి వరకు వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి.



శ్రీనగర్‌కాలనీ పెట్రోల్ బంక్ ఎదురుగా నిలిచిన వరద నీరు



శ్యాంలాల్ బిల్డింగ్ వద్ద నిలిచిన వరద నీరు



ప్రకాశ్‌నగర్‌లో ఇళ్ల మధ్య చేరిన వరద నీరు



నిమ్స్ ఆస్పత్రి వెనకాల ట్యాంకర్ పై కూలిన చెట్టు



ఖైరతాబాద్ ఓల్డ్ సీబీఐ క్వార్టర్స్ వద్ద నిలిచిన వరద నీరు



సెక్రటేరియట్ వద్ద ట్రాఫిక్‌జామ్



అమీర్‌పేటలో వరద నీటిలో బస్సు



సెక్రటేరియట్ వద్ద భారీగా నిలిచిన వాహనాలు



పంజాగుట్టలో నడిరోడ్డుపై ఆగిపోయిన కారును తోస్తున్న ట్రాఫిక్ పోలీసులు



బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.12లో మ్యాన్‌హోల్ చుట్టూ మట్టిని తొలగిస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్

కూల్చేసినా.. మళ్లీ కట్టారు..

ఖైరతాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేని స్లాబును కూల్చివేసినా మళ్లీ నిర్మాణం చేసిన ఒక భవనాన్ని జీహెచ్ఎంసీ అధికారులు సోమవారం సీజ్ చేశారు. ఎస్ఆర్ నగర్‌లో 5 అంతస్తులకు అనుమతి పొంది 6వ అంతస్తు అక్రమంగా నిర్మించిన ఓ భవనానికి ఖైరతాబాద్ సర్కిల్ అధికారులు నోటీసులిచ్చారు. యజమానిని కార్యాలయానికి పిలిపించి చెప్పినా వినకపోవడంతో 6వ అంతస్తు స్లాబ్‌ను కూల్చి వేశారు. అయినా, ఆ స్లాబ్‌ను పునరుద్ధరించి నివాస భవనం కోసం అనుమతి పొంది హాస్టల్ కోసం వినియోగించేందుకు ప్రయత్నిస్తున్న భవనాన్ని సోమవారం ఖైరతాబాద్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ సయీదుద్దీన్, సిబ్బంది సీజ్ చేశారు.

మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే



సతీష్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న తలసాని

అమీర్‌పేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మృతుల కుటుంబాలను సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. సనత్‌నగర్ డివిజన్ దాసారం బస్తీ మాజీ అధ్యక్షుడు యాదగిరి, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు పోతరాజు కుమార్ సోదరుడు సతీష్ ఆదివారం రాత్రి మృతిచెందారు. విషయం తెలుసుకున్న తలసాని సోమవారం వారి నివాసాలకు వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, బీఆర్ఎస్ సనత్‌నగర్, అమీర్‌పేట డివిజన్ అధ్యక్షులు కొలను బాల్‌రెడ్డి, హన్మంతరావు, నాయకులు అశోక్ యాదవ్, వనం శ్రీనివాస్, కూతురు నర్సింహ, కట్ట బలరాం, భూపాల్‌రెడ్డి, ఆకుల రాజు తదితరులు ఉన్నారు.

సంక్షేమ పథకాలపై కళాజాత



మేయర్ గద్వాల విజయలక్ష్మితో సారథి కళాకారుల బృందం

యూసుఫ్ గూడ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజా పాలనలో అందిస్తున్న ఆరు గ్యారెంటీలపై సారథి కళాబృందం వినాయక్ నగర్, ఇంజనీర్ కాలనీ, అంబేడ్కర్ నగర్‌లో సోమవారం జరిగిన అభివృద్ధి కార్యక్రమాలలో సంక్షేమ గీతాలను ఆలపించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభా వేదికల వద్ద చైతన్యవంతమైన గీతాలతోపాటు ఆరు గ్యారెంటీలను అర్హులందరూ అందుకోవాలని సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. కార్యక్రమంలో సారథి కళాకారులు శ్రీనివాస్ రాజు, విద్యానంద చారి, డాక్టర్ లింగ శ్రీనివాస్, తాటికొండ సునీత, కరుణ, బాలునాయక్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రాజ్ నగర్‌లో కలుషితనీరు

ఖైరతాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ రాజ్ నగర్‌లో కొన్ని రోజులుగా కలుషిత నీరు వస్తున్నా, అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపించారు. సోమవారం రాజ్ నగర్ అధ్యక్షుడు శ్రీనివాస్ నేతృత్వంలో స్థానికులు ఖాళీ బిందెలతో జలమండలి ప్రధాన కార్యాలయంలో నిరసన వ్యక్తం చేశారు. వీరికి మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య మద్దతు తెలిపారు. అనంతరం వినతిపత్రాన్ని జలమండలి ఎండీ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'జూబ్లీహిల్స్‌లో గులాబీ జెండా ఎగురవేయాలి'

బోరబండ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గులాబీ జెండా ఎగురవేయాలని బీఆర్ఎస్ నాయకులు పిలుపునిచ్చారు. బోరబండ డివిజన్ సైట్-4,5లోని పీజేఆర్ గ్రౌండ్స్‌లో దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, బీఆర్ఎస్ మైనారిటీ విభాగం బోరబండ నాయకుడు ఎం.డి. సర్దార్ సంతాపసభ సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డా. దాసోజు శ్రవణ్, ఎమ్మెల్యే కె.పి.వివేకానంద, మాజీ హోం మంత్రి ఎం.డి.మహమూద్ అలీ, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణువర్ధన్‌రెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించడమే మాగంటికి నిజమైన నివాళి అని అన్నారు. సర్దార్ మరణానికి కారణమైన వారిని జైల్లో పెట్టాలని డిమాండ్ చేశారు. గోపీనాథ్ సతీమణి మాగంటి సునీత, కార్పొరేటర్లు దేదీప్యరావు, రాజ్‌కుమార్ పటేల్, బీఆర్ఎస్ నాయకులు శ్యామ్‌రావు, అబ్దుల్లా సోహైల్, కృష్ణమోహన్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా, మాగంటి గోపీనాథ్ సంతాప సభ ఎన్నికల ప్రచార సభగా కొనసాగింది. కార్యక్రమానికి హాజరైన వారందరికీ కానుకలు అందజేశారు.

గంగ తెప్పోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

ఖైరతాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని గంగపుత్రులు వైభవంగా జరుపుకునే గంగ తెప్పోత్సవం ఆగస్టు 17న జరగనుంది. ఈమేరకు సోమవారం ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఉత్సవ పోస్టర్, బ్యానర్లను ఆవిష్కరించారు. తెలంగాణ గంగ తెప్పోత్సవ కమిటీ అధ్యక్షుడు ఎం.మహేందర్ బాబు, ప్రతినిధులు ఎమ్మెల్యేను కలిశారు. 17 న మధ్యాహ్నం 12 గంటల నుంచి ఖైరతాబాద్ ఏడుగుళ్ల ఆలయం నుంచి భారీ ర్యాలీగా హుస్సేన్ సాగర్ తీరంలో ఉన్న గంగమ్మ ఆలయం వరకు శోభాయాత్ర ఉంటుందని, అక్కడ పూజల అనంతరం గంగపుత్రుల ఆత్మీయ సమ్మేళనం ఉంటుందని మహేందర్ బాబు తెలిపారు. కార్యక్రమంలో గంగ తెప్పోత్సవ కమిటీ ప్రతినిధులు మంగళపల్లి రాజు, పూస నర్సింహ, గుండు జగదీష్, పూస మురళి, బాబురావు, విశాల్ బాబు తదితరులు పాల్గొన్నారు.

'పెద్దమ్మ తల్లి ఆలయం పునర్నిర్మించాలి'

బంజారాహిల్స్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.12 ఎమ్మెల్యే కాలనీలో రెవెన్యూ అధికారులు కూల్చివేసిన పెద్దమ్మ తల్లి ఆలయానికి 1,500 గజాల స్థలం కేటాయించి పునర్నిర్మించాలని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ఆలయ కమిటీతో కలిసి సోమవారం కలెక్టర్ హరిచందనను కలిసి వినతిపత్రం ఇచ్చారు.

గ్యాంగ్‌రేప్ కేసులో యువకుడికి 25 ఏళ్ల జైలు

బౌద్ధనగర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): బాలికపై గ్యాంగ్‌రేప్ కేసులో ఓ యువకుడికి 25 సంవత్సరాల జైలుశిక్ష విధిస్తూ నాంపల్లి కోర్టు తీర్పు చెప్పింది. చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ అనుదీప్ తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్ నామాలగుండుకు చెందిన కమలాకర శివకుమార్ అలియాస్ శివ(19) ప్రైవేట్ ఉద్యోగి. అదే ప్రాంతానికి చెందిన ఓ బాలికతో పరిచయం పెంచుకున్నాడు. 2021 జనవరిలో ఇంటిలో ఎవరూ లేని సమయంలో మరో ముగ్గురు స్నేహితులతో కలిసి బాలికను తన గదికి తీసుకువెళ్లి బెదిరించి గ్యాంగ్ రేప్‌కు పాల్పడ్డారు. ఆ సమయంలో వీడియోలు, ఫొటోలు తీసి, ఎవరికైనా చెపితే వీటిని ఇంటర్నెట్‌లో అప్‌లోడ్ చేస్తామని బెదిరించారు. అనారోగ్యం బారిన బాలికకు కుటుంబసభ్యులు వైద్యం చేయించిన తర్వాత ఆరా తీయగా తనపై నలుగురు యువకులు అత్యాచారం చేశారని తెలిపింది. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోక్సో ఐటీ చట్టాల ప్రకారం కేసును నమోదు చేసిన పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. నాలుగు సంవత్సరాలు కోర్టులో కేసు నడిచిన తర్వాత వాదోపవాదాలు విన్న నాంపల్లి 12వ అదనపు జడ్జి అనిత సోమవారం తీర్పునిచ్చారు. బాలికపై గ్యాంగ్‌రేప్ జరిగినట్లు నేరం రుజువు కావటంతో ప్రధాన నిందితుడు కమలాకర శివకుమార్‌కు పోక్సో చట్టం కింద 25 సంవత్సరాల జైలుశిక్ష, ఐదువేల రూపాయల జరిమానా, జరిమానా చెల్లించకుంటే మరో ఆరునెలల జైలుశిక్ష, ఐటీ చట్టం ప్రకారం రెండేళ్ల జైలుశిక్ష, ఐదువేల జరిమానా, జరిమానా చెల్లించకుంటే మరో మూడునెలల సాధారణ జైలుశిక్ష విధిస్తూ తీర్పును వెల్లడించారు. కోర్టు ఆదేశాల మేరకు శివకుమార్‌ను సోమవారం చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఈ కేసులో మరో ముగ్గురు మైనర్లకు మూడు సంవత్సరాల జైలుశిక్ష విధించి వారిని జువైనల్ హోంకు తరలించారు. బాధిత బాలికకు ఐదు లక్షల రూపాయల నష్ట పరిహారం చెల్లించేలా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కేసును అప్పటి దర్యాప్తు అధికారిగా ఏసీపీ వెంకటరమణ ప్రస్తుత కరీంనగర్ అడిషనల్ డీసీపీగా విధులు నిర్వహిస్తున్నారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామిరెడ్డి, లీగల్ సపోర్ట్ కల్పన, సీడీఓ తులసీదాస్‌లు వ్యవహరించారు.

'శ్రీ చైతన్య' సెంట్రల్ ఆఫీసులో ఈఎస్ఐ హెల్త్‌క్యాంప్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్ అయ్యప్ప సొసైటీలోని శ్రీ చైతన్య విద్యాసంస్థల కేంద్ర కార్యాలయంలో ఈఎస్ఐ చందాదారులకు ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించింది. మెడికల్ కాలేజ్ డీన్ డాక్టర్ సురేష్ కుమార్ చవాన్, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాధిక ఆధ్వర్యంలో శ్రీచైతన్య ఉద్యోగులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. చందాదారులతో పాటు వారి కుటుంబ సభ్యులకు మధుమేహం, రక్తపోటు, హిమోగ్లోబిన్, కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేశారు. కార్మికులకు, కుటుంబ సభ్యులకు ఆరోగ్య పరీక్షలు నిరహించడం ఎంతో ఉపయుక్తంగా ఉందని శ్రీ చైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ యలమంచిలి శ్రీధర్ తెలిపారు. హెల్త్ క్యాంపునకు సుమారు 300 మంది ఉద్యోగులు, కార్మికులు హాజరైనట్లు ఆయన పేర్కొన్నారు.

క్రీడలతో శారీరక దృఢత్వం

యూసుఫ్‌గూడ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో శారీరక దృఢత్వం కలుగుతుందని, విద్య, ఉద్యోగ అవకాశాల్లో ప్రత్యేక కోటా ఉంటుందని బెటాలియన్ ఏడీజీపీ సంజయ్ కుమార్ జైన్, సన్నీలు అన్నారు. మొదటి పటాలము అడిషనల్ కమాండెంట్ టి.నరేందర్ సింగ్ ఆధ్వర్యంలో సోమవారం పికిల్ బాల్ కోర్టును వారు ప్రారంభించారు.

డి సన్స్ పటోలా ఆర్ట్స్ వస్త్ర ప్రదర్శన

బంజారాహిల్స్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.1లోని లేబుల్స్ పాప్-అప్ స్పేస్‌లో కొలువుదీరిన డి సన్స్ పటోలా ఆర్ట్స్ వస్త్ర ప్రదర్శనను సెలబ్రిటీ కోచ్, నగర సోషలైట్ డాక్టర్ సంగీత కోసూరు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "విభిన్నమైన పటోలా ఆర్ట్ చీరలు, పటోలా హ్యాండ్లూమ్, సిల్క్ వస్త్రోత్పత్తులను ఒకే వేదికలో ప్రదర్శించడం అభినందనీయమన్నారు. నేరుగా వీవర్ నుంచి వినియోగదారుడికి అందించేందుకు ఏర్పాటైన ఈ ప్రదర్శనను ప్రతీ ఒక్కరు సందర్శించి, మరింత ప్రోత్సహించాలని కోరారు. డి సన్స్ పటోలా ఆర్ట్స్ నిర్వాహకులు భవిన్ మాట్లాడుతూ ఈనెల 7వ తేదీ వరకు కొనసాగనున్న ప్రదర్శనలో ప్రత్యేక కలెక్షన్స్ వేదికగా పటాన్ పటోలా, బంధాని, పైఠాని, బనారసి, జరీ కోట, చందేరి, మహేశ్వరి, కాశ్మీరీ నేత వస్త్రాలు, లక్నోవి, కంచిపట్టు, వెంకటగిరి, డ్రెస్ మెటీరియళ్లు, అజ్రక్ చీరలు, కుర్తీలు, బెడ్‌షీట్లతోపాటు ఆభరణాలు వంటి 10 వేల రకాల వస్త్రోత్పత్తులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. నేత కార్మికులను ప్రోత్సహించడంతో పాటు చేనేత పరిశ్రమకు మార్కెట్‌ను అందించడమే ఈ ప్రదర్శన ప్రధాన సామాజిక లక్ష్యం అని పేర్కొన్నారు.



ఉత్పత్తులను ప్రదర్శిస్తున్న డాక్టర్ సంగీత కోసూరు

భారీవర్షం.. రోడ్లు జలమయం

బౌద్ధనగర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ డివిజన్లలోని పలు ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం ఓ మోస్తారు వర్షం కురిసింది. దీంతో గుంతల్లో వర్షపునీరు నిలిచిపోవడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. మహ్మద్‌గూడ ప్రధాన రహదారిపై మురుగు, వర్షపునీరు నిలిచిపోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు వాపోయారు. బ్రాహ్మణబస్తీ, పుల్లయ్యబావి, షాబాద్‌గూడ, అంబర్‌నగర్ తదితర ప్రాంతాల్లో వర్షం కురవడంతో రోడ్లపై నీరు నిలిచిపోయింది. వారాసిగూడ చౌరస్తా, సీతాఫల్‌మండి చౌరస్తాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

బొల్లారంలో..

బొల్లారంతో పాటు పరిసర ప్రాంతాల్లో సోమవారం భారీవర్షం కురిసింది. సాయంత్రం వేళ కురియడంతో ఇంటికి వెళ్లే క్రమంలో విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మోకాళ్ల లోతు వర్షంనీరు ప్రవహించడంతో ప్రజలు ఆందోళన చెందారు. డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ నుంచి వర్షం నీరు సరిగా వెళ్లకపోవడంతో రోడ్లు మొత్తం వర్షం నీటితో నిండిపోయాయి.

తార్నాకలో..

నగరంలో సోమవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి తార్నాక పరిసర ప్రాంతాల్లో జన జీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఉద్యోగులు, పాఠశాలలు/కాలేజీల నుంచి ఇంటికి వెళ్లే విద్యార్థులు, ద్విచక్ర వాహనదారులు తడిసి ముద్దయ్యారు. అంతేకాకుండా ఫుట్ ఫాత్ వ్యాపరులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అప్రమత్తమైన నల్లకుంట ట్రాఫిక్ పోలీసులు సికింద్రాబాద్ నుంచి ఉప్పల్ వైపునకు వెళ్లే రహదారి, ఓయూ నుంచి లాలాపేట్ వైపు వెళ్లే ప్రధాన రహదారిలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టారు.

మారేడుపల్లిలో..

సోమవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలైన మారేడుపల్లి ఎల్.శంక్ నగర్, మారేడుపల్లి, ప్రధాన మార్గం, అంబేడ్కర్ నగర్ బస్తీని వరద నీరు ముంచెత్తింది. కార్ఖానా పీఎస్ ముందు రాజీవ జాతీయ రహదారి ప్రధాన మార్గంలో మోకాలి లోతు నీరు నిలిచింది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వర్షం తగ్గుముఖం పట్టాక వాహనదారులు ట్రాఫిక్ జామ్‌తో ఇబ్బందులు పడ్డారు.



బోయినపల్లిలో రోడ్డుపై వరద నీరు



మహ్మద్‌గూడ ప్రధాన రహదారిపై వర్షపునీరు



తార్నాక చౌరస్తాలో ట్రాఫిక్ జామ్ కాకుండా క్లియర్ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు



లోతట్టు ప్రాంతమైన అంబేద్కర్‌నగర్ బస్తీలో వరద నీరు



వర్షంనీటితో నిండిన రోడ్డు



డ్రైనేజీ పనులను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు : ఎమ్మెల్యే

మారేడుపల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ఈస్ట్ మారేడుపల్లి టీచర్స్ కాలనీలో అపరిష్కృతంగా ఉన్న డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు కంటోన్మెంట్ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. రూ.32 లక్షల వ్యయంతో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన స్ట్రామ్ వాటర్ డ్రైన్ పనులను ఎమ్మెల్యే శ్రీగణేష్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఎన్నో ఏళ్లుగా వర్షాకాలంలో పైనుంచి వచ్చే వాటర్‌ఫ్లో వల్ల ఇళ్లలోకి నీళ్లు చేరి ఆ ప్రాంత ప్రజలు ఇబ్బంది పడుతుండడంతో ఎమ్మెల్యే ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లి నిధులు మంజూరు చేయించి ఇటీవల పనులను ప్రారంభించినట్లు తెలిపారు. దీంతో టీచర్స్ కాలనీ, అంబేద్కర్‌నగర్ బస్తీ వాసులకు రానున్న రోజుల్లో డ్రైనేజీ సమస్యతో పాటు వరదనీటి ముప్పు నుంచి ఎలాంటి ఇబ్బందులు లేకుండా మోక్షం కలుగుతుందని ఆయన తెలిపారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించే విధంగా అధికారులు ఎప్పటికప్పుడు పనులు జరుగుతున్న ప్రాంతంలో క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ కొనసాగించాలని అధికారులను ఆయన ఆదేశించారు. కాంగ్రెస్ నాయకులు సంతోష్ యాదవ్, నాగేష్ యాదవ్, నర్సింగరావు, బస్తీవాసులు ఉన్నారు.

టీజీఎస్ ఆర్టీసీలో అప్రెంటిస్ ఉద్యోగాల మేళా

మారేడుపల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : టీజీఎస్ఆర్టీసీ సికింద్రాబాద్ రీజియన్ పరిధిలోని 11 డిపోల గ్యారేజ్ ఆపరేషన్ ఆఫీస్ విభాగంలో పనిచేయడానికి ఆసక్తి గల ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్(మెకానికల్, ఆటోమొబైల్, ఎలక్ట్రికల్), డిప్లొమా(మెకానికల్, ఆటోమొబైల్, ఎలక్ట్రికల్), నాన్ ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ (బీఏ, బీకాం, బీఎస్సీ, బీసీఏ, బీబీఏ)లలో 2021 సంవత్సరం తర్వాత ఉత్తీర్ణులు అప్రెంటిషిప్ ఎన్నికకు సికింద్రాబాద్ జేబీఎస్‌లో 7, 8 తేదీల్లో ఉదయం 11 నుంచి సాయంత్రం 5 వరకు రెండు రోజుల మేళా నిర్వహించడం జరుగుతుందని సికింద్రాబాద్ ప్రాంతీయ అధికారి సుచరిత ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ మేళాలో పాల్గొని పేర్లను నమోదు చేసుకోగలరని వివరించారు. నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మండల కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు



భిక్షపతి, ఎంఆర్ఓ

తిరుమలగిరి ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వరుసగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తిరుమలగిరి మండల కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని ఎంఆర్ఓ భిక్షపతి సోమవారం ఆంధ్రజ్యోతికి తెలిపారు. మండల పరిధిలోని బస్తీ, కాలనీవాసుల ఇళ్లలోకి వర్షంనీరు చేరి ఇబ్బందులు తలెత్తితే తమకు సమాచారం సమాచారం అందించాలని ఎంఆర్ఓ తెలిపారు. తమ సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. పాత భవనాలు, శిథిలావస్థకు చేరుకుని కూలడానికి సిద్ధంగా ఉన్నట్లు అనిపించినా సమాచారం ఇవ్వాలని చెప్పారు. నాలాల పక్కన నివాసం ఉన్నవారు అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో సునీల్ కుమార్(గిర్దావర్) 7989545988, భాను చందర్(స్పెషల్ ఆర్ఐ) 6301566431, హేమంత్ అఖిల్ (స్పెషల్ ఆర్ఐ) 7093458406, వంశీ(స్పెషల్ ఆర్ఐ) 8309201729, శేఖర్(రెకార్డ్ అసిస్టెంట్) 9697311115 తమ సిబ్బందిని సంప్రదించవచ్చని తెలిపారు.



సమావేశంలో జన ఆరోగ్య సమితి సభ్యులు

జన ఆరోగ్య సమితి సమావేశం

రెజిమెంటల్‌బజార్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): బస్తీ దవాఖానాల్లో అందిస్తున్న వైద్యసేవలతో పాటు మెరుగైన వసతుల కోసం తీసుకోవాల్సిన అంశాలపై ప్రతినెలా నిర్వహించే కేంద్ర ప్రభుత్వ కార్యక్రమమైన జన ఆరోగ్య సమితి సమావేశం మోండా డివిజన్ శివాజీనగర్ బస్తీ దవాఖానలో జరిగింది. సోమవారం నిర్వహించిన సమావేశంలో మోండా డివిజన్‌లో ఉన్న సాంబమూర్తీనగర్, చాపలబాయి,శి వాజీనగర్ బస్తీ దవాఖానాల పరిధిలో టీబీ, డెంగ్యూ, మలేరియా, ఆరోగ్యంపై అవగాహన క్యాంపులు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొంతం దీపిక, ఎస్‌పీహెచ్‌ఓ శ్రీకాంత్, వైద్యులు, స్టాఫ్ నర్సు ఆరోగ్య సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం



రూప (ఫైల్)

బౌద్ధనగర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి వెళ్లిన ఓ యువతి అదృశ్యమైన సంఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సీతాఫల్‌మండి సుభాష్‌చంద్రబోస్‌నగర్‌కు చెందిన గాజుల రూప(22) హబ్సిగూడలో ఓ ప్రైవేట్ కంపెనీలో టెలిఫోన్ ఆపరేటర్‌గా పనిచేస్తుంది. 1వ తేదీ రాత్రి ఎనిమిది గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. ఆమె కోసం పలుచోట్ల గాలించిన ఫలితం లేదు. దీంతో తన కోడలు కనిపించటం లేదని మావయ్య సుక్కా ఇసాక్ ఆదివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆస్పత్రి నుంచి వ్యక్తి అదృశ్యం



విసాలవత్ రాజు (ఫైల్)

బౌద్ధనగర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): గాంధీ ఆస్పత్రి నుంచి ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కామారెడ్డి జిల్లా క్యాసంపల్లి తండాకు చెందిన విసాలవత్ రాజు(40) తన రెండో భార్య వనితకు అనారోగ్యం ఉండటంతో జూలై 25న గాంధీలోని మహిళావార్డులో చేర్పించాడు. భర్త రాజు సహాయకుడిగా ఉండేవాడు. రాజుకు కల్లు తాగే అలవాటు ఉండేది. జూలై 28న ఆస్పత్రి నుంచి ఇంటికి వెళ్లిన వనిత భర్త కనిపించటం లేదని కుటుంబ సభ్యులకు తెలిపింది. రాజు కోసం పలుచోట్ల గాలించిన ఫలితం లేదు. దీంతో తన తమ్ముడు కనిపించటం లేదని అన్నయ్య విసాలవత్ రెడ్యా ఆదివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బస్ షెల్టర్లు నిర్మించండి

● అధికారుల నిర్లక్ష్యం ● అసహనంలో స్థానికులు



ఫుట్‌బాల్ గ్రౌండ్ వద్ద ఉన్న బస్‌స్టాప్.

తిరుమలగిరి ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీజీఆర్టీసీ) అధికారుల నిర్లక్ష్యం, బాధ్యతరాహిత్యం వెరిసి ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. కొన్ని సంవత్సరాలుగా ప్రయాణికుల సౌకర్యార్థం తిరుమలగిరి ఫుట్‌బాల్ గ్రౌండ్ వద్ద ఉన్న బస్‌స్టాప్‌లో బస్ షెల్టర్‌ను నిర్మించాలని అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేదని స్థానికులు ఒకింత అసహనాన్ని వ్యక్తం చేశారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని ఆర్టీసీ అధికారులు బస్సు షెల్టర్‌ను నిర్మించాలని కోరుతున్నారు. తిరుమలగిరి ఫుట్‌బాల్ గ్రౌండ్ నుంచి మొదలుపెడితే కొన్ని ప్రాంతాల్లో బస్‌స్టాపుల వద్ద బస్‌షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కొన్ని సంవత్సరాలుగా బస్‌షెల్టర్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆయా ప్రాంతాల గుండా రాకపోకలు కొనసాగిస్తున్న ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ అధికారులు వివిధ పనుల నిమిత్తం బొల్లారం వైపు రాకపోకలు కొనసాగిస్తున్న సమయంలోనైనా పరిస్థితులను గమనించి బస్సు షెల్టర్లు నిర్మించాలన్న ఆలోచన కలగకపోవడం బాధాకరం అంటున్నారు. అధికారులు వెంటనే స్పందించి ప్రయాణికుల సంక్షేమంలో భాగంగా తిరుమలగిరి నుంచి మొదలుకుని బొల్లారం వరకు కొన్ని ప్రాంతాల్లో ఉన్న బస్‌స్టాపులలో బస్సు షెల్టర్లు నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు.

బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలి



తిరుమలగిరి ఫుట్‌బాల్ గ్రౌండ్ వద్ద ఉన్న బస్‌స్టాపు నుంచి ప్రతీరోజు తిరుమలగిరి విలేజ్, ఎస్సీ కాలనీ, వీకర్ సెక్షన్, బ్యాంక్ కాలనీ తదితర ప్రాంతాల నుంచి సికింద్రాబాద్ బొల్లారం పరిసర ప్రాంతాల్లో పనులు చేయడానికి ఈ బస్‌స్టాపు నుండే బస్సుల ద్వారా రాకపోకలు కొనసాగిస్తుంటారు. ప్రయాణికులను దృష్టిలో పెట్టుకుని అధికారులు షెల్టర్ ఏర్పాటు చేయాలి.

\- రుక్మయ్య

రాకపోకలకు ఇబ్బంది



వర్షాకాలం, ఎండాకాలంలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కుంటున్నారు. బస్ షెల్టర్ నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ బస్‌స్టాప్ నుంచి వందలాదిమంది బస్సుల ద్వారా రాకపోకలు కొనసాగిస్తుంటారు. అధికారులు చొరవ తీసుకుని బస్ షెల్టర్లు నిర్మించే బాగుంటుంది.

\- యశ్వంత్ కుమార్

గ్యాంగ్‌రేప్ కేసులో యువకుడికి 25 ఏళ్ల జైలు



శివకుమార్

బౌద్ధనగర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): బాలికపై గ్యాంగ్‌రేప్ కేసులో ఓ యువకుడికి 25 సంవత్సరాల జైలుశిక్ష విధిస్తూ నాంపల్లి కోర్టు తీర్పు చెప్పింది. చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ అనుదీప్ తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్ నామాలగుండుకు చెందిన కమలాకర శివ కుమార్ అలియాస్ శివ(19) ప్రైవేట్ ఉద్యోగి. అదే ప్రాంతానికి చెందిన ఓ బాలికతో పరిచయం పెంచుకున్నాడు. 2021 జనవరిలో ఇంటిలో ఎవరూ లేని సమయంలో మరో ముగ్గురు స్నేహితులతో కలిసి బాలికను తన గదికి తీసుకువెళ్లి బెదిరించి గ్యాంగ్ రేప్‌కు పాల్పడ్డారు. ఆ సమయంలో వీడియోలు, ఫొటోలు తీసి, ఎవరికైనా చెపితే వీటిని ఇంటర్నెట్‌లో అప్‌లోడ్ చేస్తామని బెదిరించారు. అనారోగ్యం బారిన బాలికకు కుటుంబసభ్యులు వైద్యం చేయించిన తర్వాత ఆరాతీయగా తనపై నలుగురు యువకులు అత్యాచారం చేశారని తెలిపింది. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోక్సో ఐటీ చట్టాల ప్రకారం కేసును నమోదు చేసిన పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. నాలుగు సంవత్సరాలు కోర్టులో కేసు నడిచిన తర్వాత వాదోపవాదాలు విన్న నాంపల్లి 12వ అదనపు జడ్జి అనిత సోమవారం తీర్పునిచ్చారు. బాలికపై గ్యాంగ్‌రేప్ జరిగినట్లు నేరం రుజువు కావటంతో ప్రధాన నిందితుడు కమలాకర శివకుమార్‌కు పోక్సో చట్టం కింద 25 సంవత్సరాల జైలుశిక్ష, ఐదువేల రూపాయల జరిమానా, జరిమానా చెల్లించకుంటే మరో ఆరునెలల జైలుశిక్ష, ఐటీ చట్టం ప్రకారం రెండేళ్ల జైలుశిక్ష, ఐదువేల జరిమానా, జరిమానా చెల్లించకుంటే మరో మూడునెలల సాధారణ జైలుశిక్ష విధిస్తూ తీర్పును వెల్లడించారు. కోర్టు ఆదేశాల మేరకు శివకుమార్‌ను సోమవారం చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఈ కేసులో మరో ముగ్గురు మైనర్లకు మూడు సంవత్సరాల జైలుశిక్ష విధించి వారిని జ్యువెనల్ హోంకు తరలించారు. బాధిత బాలికకు ఐదు లక్షల రూపాయల నష్టపరిహారం చెల్లించేలా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కేసును అప్పటి దర్యాప్తు అధికారిగా ఏసీపీ వెంకటరమణ ప్రసుత్త కరీంనగర్ అడిషనల్ డీసీపీగా విధులు నిర్వహిస్తున్నారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామిరెడ్డి, లీగల్ సపోర్ట్ కల్పన, సీడీఓ తులసీదాస్‌లు వ్యవహరించారు.

అభివృద్ధి పనులను చేపట్టాలని వినతి



జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్‌కు ఎంపి కిషన్‌రెడ్డి లేఖను అందజేస్తున్న కార్పొరేటర్ చీర సుచిత్ర, ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు శ్రీకాంత్

రాంగోపాల్‌పేట్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : రాంగోపాల్‌పేట్ డివిజన్ పరిధిలో రూ.163.5 లక్షల నిధులతో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులను వెంటనే చేపట్టాల్సిందిగా కోరుతూ కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి రాసిన లేఖను రాంగోపాల్‌పేట్ డివిజన్ కార్పొరేటర్ చీర సుచిత్ర, బీజేపీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చీర శ్రీకాంత్‌లు సోమవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు అందజేశారు. ఈ లేఖలో విక్టోరియాగంజ్ నుంచి కర్బలా మైదాన్ ఎక్స్ రోడ్డు వరకు చేపట్టాల్సిన సీసీ రోడ్డు, జీరా నవగ్రహ హనుమాన్ దేవాలయం వద్ద, చుట్టలబస్తీ సీసీ రోడ్డు, మెక్లోడ్‌గూడలో రెయిన్ స్ట్రామ్ వాటర్ డ్రెయిన్, పెండింగ్‌లో ఉన్న విక్టోరియాగంజ్ కమ్యూనిటి హాల్ నిర్మాణ పనులను చేపట్టాలని కోరారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

స్కిల్ ఇండియా, డిజిటల్ ఇండియా, ఆయుష్మాన్ భారత్ వంటి కేంద్ర ప్రభుత్వ పథకాలను యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని రాంగోపాల్‌పేట్ కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్ అన్నారు. సోమవారం హుస్సేన్‌సాగర్ తీరాన గల యూత్ హాస్టల్‌లో యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖల ఆధీనంలోని మేరా యువ భారత్, హైదరాబాద్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్లాగ్ వర్క్‌షాప్ ఆన్ ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన చీర సుచిత్ర శ్రీకాంత్ మాట్లాడుతూ కేంద్ర పథకాల గురించి తెలియజేసి అందరూ వాటిని ఉపయోగించుకునేలా చూడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సెట్విన్ ఎండి వేణుగోపాల్, ఫిజీషియన్ డాక్టర్ విజేందర్, మాజీ ఎండీ రాంమోహన్‌లతో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణపై హైడ్రాకు ఫిర్యాదు

ముషీరాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్‌లోని కవాడిగూడ తాళ్లబస్తీలో ఫుట్‌పాత్‌లు ఆక్రమించి చేపట్టిన అక్రమ నిర్మాణంపై హైడ్రాకు ఫిర్యాదు చేస్తామని తాళ్లబస్తీకి చెందిన చంద్రప్రకాష్ తెలిపారు. సోమవారం భోలక్‌పూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఫుట్‌పాత్‌లు ఆక్రమించి నిర్మించిన బహుళ అంతస్తుల అక్రమ నిర్మాణంపై పలుమార్లు జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణంపై కమిషనర్‌కు, జోనల్ కమిషనర్, డీఎంసీకి ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. 9 నెలలుగా అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ఐదు అంతస్తుల భవనం నిర్మించడం వల్ల ప్రజలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణదారునితో కుమ్మక్కు కావడం వల్లే చర్యలు తీసుకోవడం లేదని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



పతకాలు సాధించిన సిబ్బందిని అభినందిస్తున్న సీపీ అవినాష్ మహంతి

రాష్ట్ర పోలీస్ మీట్‌లో సైబరాబాద్‌కు 17 పతకాలు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రెండవ పోలీస్ డ్యూటీ మీట్‌లో సైబరాబాద్ పోలీసులు ప్రతిభ కనబర్చారు. జూలై 31 నుంచి ఆగస్టు 2 వరకు జరిగిన పోటీల్లో సైబరాబాద్ పోలీసు సిబ్బంది 17 మెడల్స్ సాధించారు. సోమవారం గచ్చిబౌలిలోని పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రతిభ కనబర్చిన పోలీసు సిబ్బందిని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి అభినందించారు. 6 బంగారు పతకాలు, 7 వెండి పతకాలు, 4 బ్రౌంజ్ పతకాలు సాధించిన ఉద్యోగులను ఆయన ప్రశంసించారు. ఫోరెన్సిక్, వీడియోగ్రఫీ, సైబర్ అవేర్‌నెస్, యాంటీ సబోటేజ్, డాగ్ స్క్వాడ్, ఫొటోగ్రఫీ విభాగాల్లో పోలీస్ డ్యూటీ మీట్ జరిగిందని సీపీ అవినాష్ మహంతి వెల్లడించారు. కార్యక్రమంలో జాయింట్ సీపీ ట్రాఫిక్ గజరావు భూపాల్, క్రైమ్స్ డీసీపీ ముత్యంరెడ్డి, అడిషనల్ డీసీపీ రాంకుమార్, అడ్మిన్ డీసీపీ రవిచందన్ రెడ్డి, సీటీసీ ఏడీసీపీ పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

● ఐదు తులాల బంగారు నగలు స్వాధీనం



వివరాలను వెల్లడిస్తున్న డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రమేష్‌గౌడ్, చిత్రంలో మాస్క్ ధరించిన వ్యక్తి నిందితుడు

బౌద్ధనగర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఇంటిలో ఒంటరిగా ఉన్న వృద్ధురాలిపై దాడిచేసి బంగారు నగలను దోచుకుని వెళ్లిన ఓ వ్యక్తిని చిలకలగూడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అతడి నుంచి ఐదు తులాల బంగారు నగలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రమేష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం సీతాఫల్‌మండి మేడిబావిలో గౌరీ సత్యమల్లికార్జున నివాస్ అపార్ట్‌మెంట్ మొదటి అంతస్తు 101ప్లాట్‌లో సత్తెమ్మ(89)అనే వృద్ధురాలు ఒంటరిగా నివశిస్తుంది. కుమార్తె అమెరికా ఉండటంతో సత్తెమ్మకు తోడుగా ఓ కేర్‌టేకర్ ప్రసన్న అనే యువతిని పెట్టారు. సత్తెమ్మ ప్లాట్‌కు ఎదురుగా ఉన్న 102ప్లాట్‌లో గిత్తవేని రాము(49) డీటీడీసీ కొరియర్ వ్యాపారం చేయటంతో నష్టాలు వచ్చి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. అతడు ఒంటరిగా ఉన్న వృద్ధురాలి మెడలోని బంగారు నగలు కొట్టేయాలని పథకం వేశాడు. 2వ తేదీ ఉదయం 8:30గంటల సమయంలో తలకు హెల్మెట్ ధరించి సత్తెమ్మ ప్లాట్‌లో ప్రవేశించి కేర్‌టేకర్ ప్రసన్నను గదిలో బంధించి వృద్ధురాలి సత్తెమ్మపై దాడి చేసి మెడలోని నాలుగు తులాల బంగారు గొలుసు, తులం బంగారు గాజు(సమారు మూడులక్షల రూపాయల విలువచేసే) దోచుకుని పారిపోయాడు. వెళ్లేటప్పుడు సీసీ కెమెరాల డివైజ్‌ను తీసుకుని తలుపులు గడియపెట్టి పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో సత్తెమ్మ ప్లాట్ ఎదురు ప్లాట్‌లో నివసించే రామునే నిందితుడని పోలీసులు గుర్తించారు. సోమవారం సాయంత్రం వారాసిగూడ చౌరస్తాలో అనుమానాస్పదంగా తిరుగుతున్న అతడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నాడు. కేసును చాకచక్యంగా పరిష్కరించిన డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రమేష్‌గౌడ్‌తో పాటు డీఎస్సై రాకేష్, కానిస్టేబుల్స్ జగదీష్, షేక్‌మదర్‌బాషా, జి.నవీన్‌కుమార్, బి.గణేశ్, వినయ్‌కుమార్, డి.కృష్ణను అడిషనల్ డీసీపీ నర్సయ్య, ఏసీపీ శశాంక్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ అనుదీప్‌లు అభినందించారు.

భవిష్యత్ ఆర్థిక వ్యవస్థకు.. విద్యార్థులే నాయకత్వం వహించాలి

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య విద్య, భవిష్యత్ అవకాశాలు, అవసరాలను అర్థం చేసుకోవడంతో పాటు అందుకు అవసరమైన ప్రణాళిక రూపొందించుకునేలా విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం అన్నారు. వాణిజ్య విద్య, వృత్తి నైపుణ్యాల మెరుగుపరచడమే లక్ష్యంగా వాణిజ్య విభాగం, అసోసియేషన్ ఆఫ్ చార్టర్డ్ సర్టిఫైడ్ అకౌంటెంట్స్ (ఏసీసీఏ) సంయుక్తంగా సోమవారం ఏర్పాటు చేసిన ఒక్క రోజు వర్క్‌షాప్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఏసీసీఏ డైరెక్టర్ ఎండీ సజిద్ ఖాన్ మాట్లాడుతూ ఫైనాన్స్ ప్రొఫెషనల్స్ పై అభివృద్ధి చెందుతున్న డిమాండ్లను వివరించారు. ఓయూ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇంద్రకంటి శేఖర్, డీన్ కె.కృష్ణ చైతన్య, కామర్స్ విభాగాధిపతి ఎం.గంగాధర్, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ ఎ.ప్యాట్రిక్ సహా అధ్యాపకులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. కార్యక్రమంలో ఓయూ అనుబంధ కళాశాలల నుంచి 70 మందికి పైగా ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు. అకా రచనలు, ముఖ్యంగా ఆల్తీయా లీ, ఎడ్యుకేషన్ పార్టనర్స్ రిలేషన్షిప్స్ లీడ్, అకా ఇండియా మిస్టర్సీనియర్ బిజినెస్ రిలేషన్‌షిప్ మేనేజర్ రాయ్‌స్టన్ ఎబెనెజర్, సౌత్, కార్యక్రమాన్ని నిర్వహించటంలో కీలకపాత్ర పోషించారు.